క్లుప్తంగా

సుద్దపల్లి నూతన వీడీసీ ఎన్నిక



డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీడీసీ చైర్మన్‌గా పానుగంటి జనార్ధన్‌రెడ్డి, రైటర్‌గా కోమటి రమణ, సభ్యులుగా పానుగంటి చిన్ను, ఆరేపల్లి మోహన్, గూండ్ల మోహన్, వడ్ల రమణాచారి, గూండ్ల అనిల్, చింతం రాజు, తిరుపతి, భూమయ్య, లోలం నడిపి గంగారాం, గాజ నడిపి లింబాద్రి, గంగాధర్, గణేష్ ఎన్నికయ్యారు. నూతన వీడీసీని మాజీ సర్పంచ్ పానుగంటి రూప సతీష్‌రెడ్డి, గ్రామస్తులు సత్కరించారు.

రేషన్ కార్డుల పంపిణీ



సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను సోమవారం పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి కృషితో 233 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరైనట్లు వారు తెలిపారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్ల బుచ్చన్న, నీరటి శ్రీధర్, ఆకుల జగన్, గౌసొద్దీన్, చంద్రాగౌడ్, ఎల్లయ్య, కిషోర్‌గౌడ్, ఫారూఖ్, సంజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపాలి



జక్రాన్‌పల్లి: మండలంలోని రైతులు ఆయిల్‌పామ్ పంట సాగుపై అసక్తి చూపాలని ఏవో దేవిక సూచించారు. మండలంలోని అర్గుల్ గ్రామంలో సోమవారం ఆమె ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ.. పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీలు అందజేస్తుందన్నారు. రైతు కేవలం ఒక ఎకరానికి రూ.1000 చొప్పున జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి నిజామాబాద్ పేరిట డీడీ చెల్లిస్తే 90 శాతం రాయితీ కింద 50 మొక్కలు ప్రీ యూనిక్ కంపెనీ వారిచే అందిస్తామని తెలిపారు. ఆయిల్ పామ్ మధ్యలో అంతర పంటగా మొక్కజొన్న, జొన్న, పసుపు, కూరగాయలు, సోయా సాగు చేసినందుకుగాను ఎకరానికి రూ.4200 చొప్పున రైతు ఖాతాలో సంవత్సరానికి ఒకసారి జమ చేస్తున్నామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు చిన్న, సన్నకారు, ఐదెకరాల లోపు ఉన్నవారికి 90 శాతం రాయితీ, ఎస్సీ , ఎస్టీ రైతులైతే 100 శాతం రాయితీ, 5 ఎకరాల మీదా సాగు చేసేవారు 80 శాతం రాయితీ కింద డ్రిప్ సౌకర్యం పొందవచ్చని తెలిపారు. ఏఈవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి హరీష్, గ్రామ మాజీ ప్రతినిధులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



నిజామాబాద్ రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య అన్నారు. సారంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల క్రీడావిభాగానికి రెండు పుట్‌బాల్స్, రెండు వాలీబాల్స్ బహుకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండాలన్నారు. ప్రభుత్వం బడుల్లో అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీతయ్యను ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్ఎం సల్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	101,400	వెండి(కిలో)	1,20,500
22 క్యారెట్స్	93,610		– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	48	గాజరుగడ్డ	30	60
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	25	50	దోసకాయ	15	30
దొండకాయ	25	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	50	90	గోబిగడ్డ	15	30
కాకరకాయ	25	50	గోబిపువ్వు	25	50
వంకాయ	15	30	బీట్‌రూట్	30	60
పాలకూర	40	80	కరివేపాకు	40	80
మెంతికూర	40	80	చామగడ్డ	30	60
కొత్తిమీర	30	60	చిక్కుడుకాయ	20	40
పుదీనా	40	80	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	25	50			

–సుభాష్‌నగర్

సర్వాయి పాపన్నకు ఘన నివాళులు



రామడుగులో పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న గౌడ సంఘ సభ్యులు

సాక్షి నెట్‌వర్క్: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాకేంద్రంతోపాటు ఆయా నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో గౌడ సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనను ఎదుర్కోవడంలో పాపన్న గౌడ్ పోరాట పటిమ మరవలేనిదన్నారు. ప్రజలను ఐక్యం చేయడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆయన కేవలం గౌడ కులస్తులకే కాకుండా సబ్బండ వర్గాలవారికి ఆదర్శంగా నిలిచారన్నారు.



నగరంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



నగరంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



కొండాపూర్‌లో..



పెద్దవాల్గోట్‌లో..



జక్రాన్‌పల్లి మండలంలో..

తాళ్లరాంపూర్ గ్రామస్తులకు అభినందన



జిల్లా జడ్జికి మొక్క అందజేసి, సన్మానిస్తున్న తాళ్లరాంపూర్ గ్రామస్తులు

నిజామాబాద్ లీగల్: బాల్కొండ నియోజకవర్గం తాళ్లరాంపూర్ గ్రామంలో వీడీసీని రద్దు చేసుకున్న గ్రామస్తులకు జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి, జిల్లా న్యాయసేవ సంస్థ కార్యదర్శి ఉదయభాస్కర్ రావు అభినందించారు. వీడీసీని రద్దు చేసుకున్న సందర్భంగా తాళ్లరాంపూర్ గ్రామస్తులు సోమవారం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో వారిని కలిశారు. ఈసందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. అధికారం, ధనబలంతో చేసే ఆధిపత్యం అంతం కాక తప్పదని, సామాజిక వెలివేతలు సమాజ ఉన్నతికి ఉపయోగపడవని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా ఉండి పల్లెల ప్రగతికి వారధులుగా నిలవాలని సూచించారు. తాళ్లరాంపూరు వీడీసీ రద్దు మహిళలు సాధించిన విజయమని అభివర్ణించారు. న్యాయసేవా సంస్థ అనేది అందరికి సమన్యాయం అందించేందుకు తనవంతు పాత్ర నిర్వహిస్తుందని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయభాస్కర్ రావు అన్నారు. అనంతరం జడ్జికి గ్రామస్తులు మొక్క అందజేసి, సన్మానించారు.

అధికారులు వేధింపులు ఆపాలి



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలపై అధికారులు వేధింపులు ఆపాలని బీఎల్‌టీయూ నాయకులు దండి వెంకట్, సబ్బని లత డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం వారు ఆందోళన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి, వారిని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిందని, ఇందులో నగర బల్దియాలో 60 మంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14మంది మహిళా వీఆర్ఏలు ఇంజినీరింగ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న వారిని శానిటేషన్ సెక్షన్‌లోకి మార్చారన్నారు. వారిని యథాస్థానంలో కొనసాగించాలన్నారు. వీఆర్ఏలు మంజుల, దేవమ్మ, నర్సుబాయి, సులేఖ, సాయిలు ఉన్నారు.

వినాయక మండపాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలి





సమావేశంలో మాట్లాడుతున్న నార్త్ సీఐ శ్రీనివాస్.. మాట్లాడుతున్న నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్

ఖలీల్‌వాడి: వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే మండపాల నిర్వాహకులు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నార్త్ సీఐ బూస శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఆయన గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వినాయకులను ప్రతిష్ఠించే మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద రాత్రివేళల్లో ఇద్దరు తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యుత్ సౌకర్యం కోసం సంబంధిత అధికారులు అనుమతి తీసుకోవాలన్నారు. ఒక సీసీటీవీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి 10 దాటిన తర్వాత సౌండ్‌బాక్స్‌లు పెట్టుకోవద్దన్నారు. మండపాల ద్వారా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అనంతరం కొన్నేళ్లుగా వినాయక మండపాల్లో మట్టి విగ్రహం ప్రతిష్ఠాపన చేసి, భక్తి భజనలతో నిమజ్జనం చేసిన వర్ని చౌరస్తాలోని గణేశ్ మండలి, ఇంద్రాపూర్ గణేశ్ మండలి, కెనాల్ కట్ట గణేశ్ మండలి, ఖిల్లా చౌరస్తా గణేశ్ మండలి ఆర్గనైజర్లను సన్మానించారు.ఎస్సై గంగాధర్, సౌత్ తహసీల్దార్ బాలరాజు, విద్యుత్ ఏడీఈ చంద్రశేఖర్, మున్సిపల్ ఏఈ వాజీద్ తదితరులు ఉన్నారు.

డీజేలకు అనుమతి తప్పనిసరి..

నగరంలోని 4వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న డీజే నిర్వహకులతో సోమవారం ఎస్సై శ్రీకాంత్ సమావేశం నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా డీజేలు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. డీజేల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, లేకుంటే సీజ్ చేస్తామన్నారు. డీజేలు పెట్టేముందు తగు జాగ్రత్తలు, తీసుకోవాలని, నిబంధనలు పాటించాలని తెలిపారు.

టూ వీలర్ షోరూమ్ ప్రారంభం



మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) పరిధిలో నూతనంగా ఏర్పాటుచేసిన కైనెటిక్ గ్రీన్ ఎలక్ట్రిక్ ఈవీ టూవీలర్స్ షోరూమ్‌ను సోమవారం నుడా చైర్మన్ కేశ వేణు, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. కేశ వేణు మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వదిలి ఇద్దరు స్నేహితులు గోగ్రీన్ అనే కాన్సెప్ట్‌తో ఈ షోరూమ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. షోరూమ్ యజమానులు మాలెపు రాజశేఖర్‌రెడ్డి, గుండు రాజ్‌కిరణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. మాలెపు నారాయణరెడ్డి, గుండు రాజాచందర్, నాయకులు, స్నేహితులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసేవరకూ ఉద్యమిస్తాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్) రద్దు చేసేవరకూ ఉద్యమిస్తామని టీజీ జేఏసీ చైర్మన్ నాశెట్టి సుమన్‌కుమార్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొద్దుటూరి మోహన్ రెడ్డి, గంగోనె కిషన్ తెలిపారు. నగరంలోని పీఆర్టీయూ భవన్‌లో వారు సోమవారం 'మహాధర్నా' గోడప్రతులను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీఎన్‌జీవో జిల్లా ప్రధానకార్యదర్శి నేతికుంట శేఖర్,పీఆర్టీయూ ప్రతినిధులు రాములు, నరేష్, సోమలింగం గౌడ్, శ్రీనివాస్, వరప్రసాద్, వెంకట రాజారెడ్డి, రమేష్, రవీందర్‌రెడ్డి, సతీష్, అంజన్న, శేఖర్, రవీందర్ నాయక్, దేవారెడ్డి పాల్గొన్నారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

మోపాల్: ఇంటి స్థలం విషయంలో జరిగిన దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జాడె సుస్మిత సోమవారం తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. ఎల్లోల్ల నారాయణరెడ్డి భూమిలో బండమీది బుచ్చన్న, ఆయన కొడుకు మధు ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఈ నెల 8న నారాయణరెడ్డి పనులు చేస్తున్న ఇంటి వద్దకు వెళ్లి స్థలం నిర్ధారణ అయ్యే వరకూ నిర్మాణం నిలిపేయాలని బుచ్చన్నకు చెప్పాడు. కోపోద్రోక్తులైన బుచ్చన్న, ఆయన భార్య గౌరవ్వ, కొడుకు మధు, అల్లుడు ప్రసాద్ కలిసి నారాయణరెడ్డి, ఆయన కొడుకులను తిడుతూ చంపేస్తామని బెదిరించారు. బుచ్చన్న అక్కడే ఉన్న రాయితో నారాయణరెడ్డి ఎడమ కన్నుపై కొట్టడంతో గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సుస్మిత తెలిపారు.

కప్పల వాగుకు జలకళ





గడ్కోల్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పలవాగు.. మీరిబాయి తండా వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు

సిరికొండ: మండలంలోని కప్పల వాగు, మొండివాగులు జలకళను సంతరించుకున్నాయి. మండలంలోని తూంపల్లి, కొండాపూర్, గడ్కోల్, ముషీర్‌నగర్ గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. తూంపల్లిలో 60.5 మి.మీ వర్షం కురిసింది. తూంపల్లి, కొండాపూర్ అటవీ ప్రాంతంలో కురిసిన వర్షానికి కప్పలవాగు, మొండివాగులు జలకళ సంతరించుకున్నాయి. మండలంలోని మిగతా గ్రామాల్లో భారీ వర్షాలు కురవక చెరువులు కొద్దిమేరనే నిండాయి. మీరిబాయి తండాకు వెళ్లే మార్గంలో వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది. భారీ వర్షానికి వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వంతెనకు ఒకవైపున మట్టి పూర్తిగా కొట్టుకుపోయి పెద్ద గుంత ఏర్పడింది. దీంతో అటువైపున ఉన్న మీరిబాయి తండాతోపాటు సుభాష్‌తండా, నామ్ల తండా, సాజునాయక్ తండా ప్రజలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు కోతకు గురికాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఆయా తండాల ప్రజలు కోరుతున్నారు.



అలుగు పారుతున్న బర్ధిపూర్ కోనం చెరువు

అలుగుపోస్తున్న బర్ధిపూర్ కోనం చెరువు

డిచ్‌పల్లి: నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ కోనం చెరువు అలుగు ఎత్తిపోస్తోంది. దీంతో సోమవారం అలుగు వద్దకు గ్రామస్తులు భారీగా చేరడంతో సందడి నెలకొంది.మండలంలోని మిగిలిన గ్రామాలలోని చెరువుల్లో నామమాత్రంగా నీళ్లు చేరాయి. వానాకాలం ప్రారంభమైన తర్వాత వరసగా వర్షాలు కురుస్తున్నప్పటికీ చెరువులు నిండకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

దశాబ్దం తర్వాత నూతన రేషన్ కార్డులు



కాలూరు గ్రామంలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు (ఫైల్)

- రూరల్ మండలంలో 3105 మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నిజామాబాద్ రూరల్: నూతన రేషన్ కార్డుల కోసం ఏళ్లుగా నిరీక్షించిన ప్రజలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్డులను మంజూరు చేయడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నూతంగా పెళ్లి చేసుకున్న వారు, కుటుంబం నుంచి వేరు పడిన జంటలు నూతన రేషన్ కార్డుల కోసం ఎంతగానో ఎదురు చూశారు. కానీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు నిరాశ వ్యక్తం చేశారు.

నిరంతర ప్రక్రియ

రూరల్ మండలంలో 19 గ్రామాలతోపాటు, నాలుగు డివిజన్‌లు విలీనం అయ్యాయి. ఈ నేపథ్యంలో మండలంలో 3105 రేషన్‌కార్డులు వచ్చినట్లు తహసీల్దార్ అనురుద్ తెలిపారు. ఇందులో 219 నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులు కాగా 2786 రేషన్ కార్డులు ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయిన వారికి మంజూరు అయినట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అధికారులు రేషన్ కార్డులు వచ్చిన వారికి పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నారు. రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అర్హులు సంబంధిత మీసేవా కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో వివరాలు తెలుసుకోవచ్చునని, అర్జీలు పెట్టుకుని రేషన్ కార్డు పొందవచ్చునని వివరిస్తున్నారు. ఏదేమైనా ఏళ్లుగా సంక్షేమ పథకాలకు దూరమైన ప్రజలు ప్రస్తుతం వచ్చిన నూతన రేషన్ కార్డులతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటా..



గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రేషన్ కార్డులు మంజూరు చేస్తారని ఎదురు చూశాం. కానీ ఎటువంటి లాభం లేకుండాపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడవక ముందే నూతన రేషన్ కార్డును మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డికి, రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డికి రుణపడి ఉంటాం.

–స్రవంతి, రేషన్ కార్డు లబ్ధిదారు, కాలూర్

రాష్ట్రంలో సుపరిపాలన..



సీఎం రేవంత్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కాకమందే అర్హులను గుర్తించి రేషన్ కార్డులను పంపిణీ చేస్తుంది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి.

–అగ్గు భోజన్న, కాలూర్ మాజీ సర్పంచ్

ఆధ్యాత్మికం

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



నిజామాబాద్ రూరల్: నగరంలోని కంఠేశ్వర్‌లోగల నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శంభులింగేశ్వరాలయం, భక్తమార్కండేయ ఆలయాల్లోనూ పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

గణపతి మాలధారణ ప్రారంభం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి)లోగల లక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం పలువురు భక్తులు గణపతి మాలధారణ చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ డాక్టర్ టి అరుణ్‌కుమార్ శర్మ మాట్లాడుతూ.. మాలాధారణ ధరించిన భక్తులు 21, 11 రోజులపాటు దీక్షలో ఉండాలని సూచించారు. 11 రోజులు ధరించాలనుకునే వారు వినాయక చతుర్థి రోజు దీక్ష ప్రారంభించాలని తెలిపారు. వినాయక మండపాలను నిర్వహించే వారందరూ గణపతి మాలధారణ ధరించాలని నిర్ణయించామన్నారు. అనంత చతుర్థి రోజున దీక్ష విరమణ ఉంటుందని, చివరి రోజు సిద్ధిముడి కార్యక్రమాన్ని నిర్వహించి మాల విరమణ చేస్తారని తెలిపారు.

సంక్షిప్తం

నేతాజీకి నివాళులు

సిరికొండ: మండల కేంద్రంలోని కిడ్స్‌పార్క్ పాఠశాలలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా నేతాజీ చిత్ర పటానికి పాఠశాల సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్, హెచ్ఎం ఆసిఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కవితల పోటీల్లో ప్రతిభ

మోపాల్: మండలంలోని సిర్పూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రచన, మాధురి, మేఘన జాతీయస్థాయి కవితల పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు సోమవారం విద్యార్థులను పాఠశాలలో ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఖమ్మంలోని పురిమల్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో జాతీయస్థాయిలో కథారచన, కవిత పోటీలను నిర్వహించారన్నారు. ఆదివారం విజేతల వివరాలను వెల్లడించగా విద్యార్థులు రచన, మాధురి, మేఘనకు బహుమతులు లభించాయన్నారు. 24న ఖమ్మంలో విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి

సుభాష్‌నగర్: బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని రిటైర్డ్ ఐఏఎస్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ చిరంజీవులు డిమాండ్‌చేశారు. బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో చిరంజీవులును కలిసిసన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. నాయకులు ఉట్నూర్ సుభాష్, పల్లికొండ అన్నయ్య, వేణుగోపాల్, పాక శంకర్, మేకల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లను సోమవారం రికవరీ చేసి 20 మందికి అందించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. సెల్ పోతే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే బాధితులకు ఫోన్ రికవరీ చేసి అందిస్తామని తెలిపారు.

జీపీ కార్యదర్శి కారు ధ్వంసం



మోపాల్: మండలంలోని కాల్పోల్ జీపీ కార్యదర్శి మోహన్ కారు అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం ధ్వంసం చేశారు. వివరాలు ఇలా..కాల్పోల్ తండాకు వెళ్లే రోడ్డులోగల బ్రిడ్జీ కోతకు గురికావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పీఆర్ డీఈ శంకర్ నాయక్, ఏఈ శ్రావణ్‌కుమార్ సోమవారం పరిశీలనకు వచ్చారు. ఈక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోహన్ తన కారును కాల్పోల్ చౌరస్తాలో పార్కింగ్ చేశాడు. రోడ్డును పరిశీలించి కారు వద్దకు వచ్చేసరికి కారు అద్దం ధ్వంసమై ఉంది. వెంటనే మోహన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.